

'అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భారతసైన్యంలో అగ్నివీర్ ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా అభ్యరుల దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా యువజన సర్వీసులశాఖాధికారి ఎ.సోమేశ్వరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహంకాని పురుష అభ్యర్థులు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. తర్వాత అభ్యర్థులు వారి అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకుంటే ఆర్మీ ర్యాలీ తేదీ, సమయం తెలుస్తుందన్నారు. ఆన్‌లైన్ పరీక్ష పాసైన వారికి ఆర్మీ ర్యాలీ ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహిస్తారన్నారు.

అడవిలో 6 కిలోమీటర్లు


గురువారం పాఠశాలకు వెళ్లలేక గ్రామంలోనే ఉండిపోయిన విద్యార్థులు

- బడి కోసం నడిచి వెళ్తున్న గిరిజన చిన్నారులు
- చదువుకోవాలంటే మైదాన ప్రాంతానికి రావాల్సిందే
- వర్షాలు, వేసవిలో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు
- రెండు దశాబ్దాలుగా పాఠశాల ఏర్పాటు కోసం ఎదురుచూపు

జియ్యమ్మవలస, మార్చి 20(ఆంధ్రజ్యోతి)

'రెండు దశాబ్దాలుగా మా గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నాము. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ బడి మాత్రం రావడం లేదు. మా పిల్లల చదువు, వారి భవిష్యత్ కోసం ఎంతో ఆందోళన చెందుతున్నాము. మా ఆవేదన అరణ్యరోదనలా మిగిలిపోతోంది. దయచేసి మా పరిస్థితి ఒక్కసారి అర్థం చేసుకోండి' అంటూ జియ్యమ్మవలస మండలం టీకే జమ్ము పంచాయతీ కూటం గ్రామ గిరిజనులు వేడుకుంటున్నారు. కనీసం వచ్చే ఏడాది నుంచి అయినా పాఠశాల ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

● కూటం టీకే జమ్ము పంచాయతీలో మారుమూల గిరిజన గ్రామం. ఈ గ్రామంలో 15 మంది విద్యార్థులు ఉన్నారు. వీరు తమ చదువుకోవాలంటే ఆరు కిలోమీటర్లు కాలినడకన గోర్లి గ్రామానికి వెళ్తున్నారు. అదీకూడా అటవీ ప్రాంతంలో.. రాళ్లు తేలిన కాలిబాటన వెళ్తున్నారు. పాఠశాలకు వెళ్లిన నుంచి తిరిగి ఇంటికి వెళ్లేవరకు వారి తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి. ఈ విద్యార్థులు ఎండకు, వర్షాలకు భయపడి కొన్ని రోజులు బడికి దూరంగా ఉండాల్సి వస్తోంది. బడికి వెళ్తున్నప్పుడు.. తిరిగి వస్తున్నప్పుడు భారీ వర్షాలు కురిస్తే తమ పిల్లల గతేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే అటవీజంతువులు వస్తే వారిని ఎలా రక్షించుకుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడచిన రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలను, ప్రజాప్రతినిధులను కోరుతున్నామని, ఎవరూ తమగోడు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పాఠశాల ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల చాలామంది చదువు మానేస్తున్నారని వారు చెబుతున్నారు.

భయపడుతున్నాం



పిల్లలు మా గ్రామం నుంచి గోర్లి గ్రామానికి చదువుకోవడానికి వెళ్తే చాలా భయపడుతున్నాం. ఆరు కిలోమీటర్లు కాలినడకన అడవి మధ్య రాళ్లు తేలిన రోడ్డుపై వెళుతున్నప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం.

- కొండగొర్రి సుశీల, గిరిజన మహిళ, కూటం గ్రామం

మా పరిస్థితి అర్థం చేసుకోండి



ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ మా పరిస్థితిని అర్థం చేసుకోవాలి. మా పిల్లల భవిష్యత్ అంధకారంలో పడిపోతోంది. చదువుకోవాలనే ఆశ మా పిల్లలకు, చదివించాలనే ఆశ మాకు ఉన్నా ఏమీ చేయలేకపోతున్నాం. గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయండి.

-కొండగొర్రి నాగేశ్వరరావు, గ్రామపెద్ద, కూటం గ్రామం

ఆందోళనకరమే



కూటం గ్రామం నుంచి గోర్లి గ్రామానికి చదువుకోవడానికి చిన్నారులు కాలినడకన వస్తుండటం చాలా ఆందోళనకరమే. చాలా దారుణమైన పరిస్థితి. పాఠశాల ఏర్పాటు చాలా అవసరం. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి.

-బిడ్డిక సుగ్రీవులు, ప్రతినిధి, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ, గోర్లివలస గ్రామం

పరిశీలిస్తాం



కూటం గ్రామంలో పాఠశాల ఏర్పాటు విషయం నా దృష్టికి వచ్చింది. పూర్తి పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

-కె.చంద్రబాబు, ఏటీడబ్ల్యూవో, కురుపాం సబ్ డివిజన్

మాదకద్రవ్యాలతో సంపాదించిన ఆస్తుల జప్తు

- గంజాయి నిర్మూలనకు పటిష్ఠమైన చర్యలు
- విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి
- మూడు జిల్లాల్లో సీజ్‌చేసిన 7,378 కిలోలు నిర్వీర్యం


గంజాయిని నిర్వీర్యం చేస్తున్న డీఐజీ, ఎస్పీలు

లావేరు/బెలగాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో సంపా దించిన ఆస్తులను జప్తు చేస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి హెచ్చరించారు. గంజాయి సమూల నిర్మూలనకు కఠినచర్యలు చేపట్టామన్నారు. ఇటీవల మూడు జిల్లాల్లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన గంజాయిని.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాతకుంకాం గ్రామంలోని రైన్ బో ఇండస్ట్రీ వద్ద గురువారం డీఐజీ పర్యవేక్షణలో ముగ్గురు ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్ జిందాల్, ఎస్వీ మాధవరెడ్డి నిర్వీర్యం చేశారు. డీఐజీ మాట్లాడుతూ.. 'విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, వాటి మూలాలను గుర్తించి, బాధ్యులపై కేసులు నమోదు చేశాం. డీజీపీ హరీష్‌కుమార్ గుప్త ఆదేశాల మేరకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసులు 226 కేసుల్లో సీజ్ చేసిన 7,378 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వీర్యం చేశాం. అనకాపల్లి జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 34,419 కిలోల గంజాయి, 39.4 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను దహనం చేశాం. రెండో దశలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత నెల 3,075 కిలోల గంజాయిని, 25.5 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను నిర్వీర్యం చేశాం. మూడో దశలో గురువారం శ్రీకాకుళం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. గడచిన 8 నెలల్లో గంజాయి పూర్తిస్థాయి నిర్మూలనలో భాగంగా 524 కేసుల్లో 31,768 కిలోల గంజాయిని, 120.5 లీటర్ల హాషిష్, 372 వాహనాలను సీజ్‌చేసి 2,050 మంది నిందితులను అరెస్ట్ చేశాం. ఇందులో 575 మంది అంతరాష్ట్ర నిందితులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికలో రేంజ్ పరిధిలో ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించాం. 24 అంతరాష్ట్ర, 14 జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేశాం. డ్రోన్ కెమెరాల నిఘా ఏర్పాటు చేసి, 327 గ్రామాల్లో 90 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయిని నిర్వీర్యం చేశాం. గంజాయిని అక్రమంగా సాగుచేస్తున్న 34 అంతరాష్ట్ర ముఠా, 21 అంతర జిల్లాల ముఠాలను పట్టుకుని వారిలో 467 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిందితులుగా గుర్తించాం. ఈ కేసులకు సంబంధించి 49 మందిపై పీడీ యాక్ట్, 1,031 మందిపై గంజాయి సస్పెక్ట్ షీట్స్ తెరిచాం. విశాఖ రేంజి పరిధిలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు 'సంకల్పం' పేరిట అవ గాహన కార్యక్రమాలు నిర్వహించి 5 లక్షల మంది విద్యార్థులకు చైతన్యం కలిగించాం. ప్రతి పాఠశాల, కళాశాలలో డ్రాప్ బాక్సును ఏర్పాటు చేశాం. 23 గంజాయి కేసుల్లో (మిగతా 8వ పేజీలో..)


మూడు జిల్లాల్లో పట్టుబడిన గంజాయి

నాణ్యమైన జీడిపప్పు కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నుంచి నాణ్యమైన జీడిపప్పు కొనుగోలు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది 300 మెట్రిక్ టన్నుల జీడిపప్పు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. స్వయంగా జీడి పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని క్రయ, విక్రయాల జరుపుకునేందుకు వీడీవీకేల సభ్యుల తీర్మానం తప్పనిసరన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్లు, ఏపీఎంలు, ఉద్యానవ శాఖాధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యాపారుల కన్నా ముందే నాణ్యమైన జీడిపప్పును రైతుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. పప్పును ప్రాసెసింగ్ చేసి విక్రయాలు జరిపేవరకు అవసరమయ్యే గన్నీ బ్యాగ్‌లు, స్టోరేజ్ పాయింట్లను సిద్ధం చేయాలన్నారు. అలాగే జీడి పరిశ్రమలకు అవసరమైన యంత్ర సామగ్రి, ప్రాసెసింగ్, క్రయవిక్రయాలు, ప్యాకింగ్, రవాణా, మార్కెటింగ్ సదుపాయాలపై సభ్యులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఏప్రిల్ 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తికావాలన్నారు. క్రయ విక్రయాల రికార్డులు పక్కాగా నిర్వహించేందుకు ఇద్దరు వీడీవీకే సభ్యులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, వెలుగు ప్రాజెక్టు అధికారి వై.సత్యం నాయుడు, ఏపీఎంలు, ఉద్యానవన శాఖాధికారులు పాల్గొన్నారు.

వేసవి అలవెన్స్ లేనట్టేనా?


ఉపాధి పనులు చేపడుతున్న వేతనదారులు (ఫైల్)

- మార్చిలోనే మండుతున్న ఎండలు
- విడుదల కాని 'ఉపాధి' మార్గదర్శకాలు
- కూలీలకు వేతనం గిట్టుబాటయ్యేనా..?

కొమరాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ వేతనదారులకు వేసవి అలవెన్స్ ప్రశ్నార్థకంగా మారింది. ఇంతవరకు మార్గదర్శకాలు విడుదల కాకపోవడమే ఇందుకు కారణం. వాస్తవంగా ఏటా జనవరిలోనే అలవెన్స్‌ను ప్రకటించేవారు. కానీ ఈ సారి మార్చి వచ్చినా ఇంతవరకు ఆ ఊసే లేదు. మరోవైపు వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిన నేపథ్యంలో వేతనదారులు పని ప్రదేశంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఉపాధి కూలీలకు కనీస వేతనం 300కు తగ్గకుండా చూడాలని కేంద్రం ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది. అయితే అందులోనే వేసవి అలవెన్స్ ఉంటుందని పలువురు చెబుతున్నారు. మరోవైపు మార్చి నెల పూర్తి కావస్తుంది. దీంతో ఈ ఏడాది ఉపాధి వేతన దారులకు వేసవి అలవెన్స్ లేనట్లేనని కొంతమంది అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కూలీలకు వేసవిలో రూ. 300 వేతనం కచ్చితంగా గిట్టుబాటయ్యేనా అనే సందేహాన్ని పలువురు వ్యక్తపరుస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

● జిల్లాలోని 15 మండలాల్లో సుమారు 2.10 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. వాటిల్లో 3.98 లక్షల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. వేసవిలో ఉపాధి పనులు చేయడం కష్టంగా ఉంటుందని భావించిన ప్రభుత్వాలు గతంలో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20 శాతం వరకు పనుల పరిమాణం తగ్గించి 100 శాతం పనికి వేతనం అందించేవారు. అంటే వేసవిలో నేల గట్టిగా ఉండటంతో పని తక్కువగా జరిగినా వేసవి అలవెన్సుతో కలిపి వేతనం ఇచ్చేవారు. దీంతో వేతనదారులకు కూలి గిట్టుబాటు అయ్యేది.

● ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుతం జిల్లాలో చెరువుల్లో పూడిక తీత, నీటి కుంటలు, కందకాల తవ్వకం వంటి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంపకం వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో పది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఏప్రిల్ నుంచి మరిన్ని పని దినాలు కల్పించే అవకాశం ఉంది. 50 మంది కూలీలను పనులకు తీసుకొచ్చే ప్రతి మేట్‌కు రూపాయిన్నర వంతున అదనపు వేతనం అందిస్తారు. కాగా కూలీలకు వేసవి అలవెన్స్ విషయమై కొమరాడ ఏపీవో బాలకృష్ణను వివరణ కోరగా ఇప్పటివరకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదన్నారు. ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు.

డాక్టర్ వెళ్లిపోయారు.. రేపు రండి

పాలకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండుటెండలో వచ్చిన ఆ దివ్యాంగులకు నిరాశే ఎదురైంది. డాక్టర్ లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగి పోయారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు పాలకొండ ఏరియా ఆసుపత్రి లో పింఛన్ల పరిశీలనలో భాగంగా తనిఖీలు ఉంటాయని వైద్యాధికారులు వీరఘట్టం మండలం వాసులకు చెప్పారు. దీంతో 30 మంది దివ్యాంగులు పాలకొండ ఏరియా ఆసుపత్రికి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకున్నారు. అయితే వైద్యాధికారి అప్పటికే ఆసుపత్రి నుంచి వెళ్లి పోయారని అక్కడి సిబ్బంది చెప్పారు. అందరినీ శుక్రవారం ఉదయం 8 గంటలకు రావాలన్నారు. దీంతో ఎండలకు అల్లాడుతూ వస్తే రేపు రమ్మనమేంటని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు.


వైద్యుడి కోసం ఆసుపత్రిలో వేచి ఉన్న దివ్యాంగులు


విజయచంద్రకు బహుమతి అందిస్తున్న సీఎం చంద్రబాబు

విజయచంద్ర.. విన్నర్

- షాట్‌పుట్‌లో మొదటి స్థానం

పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శాసనసభ్యులకు జరిగిన క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఉత్తమ ప్రతిభ కనబరిచారు. షాట్‌పుట్ విభాగంలో మొదటి స్థానం సాధించారు. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీల్లో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు. కబడ్డీలో విన్నర్‌గా నిలిచారు. రన్నింగ్‌లో రెండోస్థానం సాధించారు. పోటీల అనంతరం విజయచంద్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా బహుతులు అందుకున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో పాటు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు తదితరులు ఆయన్ను అభినందించారు.

కుంకి ఏనుగులను ఇక్కడే మచ్చిక చేస్తాం

- అప్పయ్యపేటలో అటవీ శాఖాధికారుల సమావేశం
- అభ్యంతరం తెలిపిన ప్రజలు

సీతానగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కుంకి ఏనుగులను ఇక్కడే మచ్చిక చేస్తామని పార్వతీపురం రేంజ్ అటవీశాఖ అధికారి రామనరేష్ అన్నారు. అప్పయ్యపేట గ్రామంలో అప్పయ్యపేట, గుచ్చిమి, తాన్న సీతారాంపురం, చిన్నారాయుడుపేట, రేపటివలస, తామరఖండి గ్రామాల ప్రజలతో అటవీశాఖ అధికారులు గురువారం సమావేశం అయ్యారు. రామనరేష్ మాట్లాడుతూ చుట్టుపక్కల భూములు సాగు చేసుకుంటున్న పేదలకు ఆటంకం కలిగించబోమని, యథావిధిగా సాగు కొనసాగించవచ్చన్నారు. కానీ కుంకీ ఏనుగులను తీసుకొచ్చి మచ్చిక చేసే ఏర్పాట్లు మాత్రం ఇక్కడే కొనసాగుతాయని స్పష్టం చేశారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు అంగీకరించలేదు. ఫారెస్ట్ అధికారి మనోజ్‌కుమార్, సీపీఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి వేణు, రైతుకూలీ సంఘం నాయకులు పి.శ్రీనునాయుడు, సీపీఐ నాయకులు కోరంగి మన్మధరావు, భాస్కరరావు, కుమార్, స్థానిక ఎంపీటీసీ సభ్యులు బురిడి సూర్యనారాయణ, సీతానగరం మండల సీపీఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ పాల్గొన్నారు.


ప్రజలతో సమావేశమైన అటవీశాఖాధికారులు

- పట్టణాల్లో 'జీవనోపాధుల జాతర'
- రాయితీ రుణాలు, నైపుణ్య శిక్షణే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా 100 రోజుల ప్రణాళిక

అతివలకు తోడుగా..



పట్టణంలో మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)



● ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో విజయనగరం నగర పాలక సంస్థ, రాజాం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీలు ఉన్నాయి. పాలకొండ, నెల్లిమర్ల నగర పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 11,366 మహిళా సంఘాలు ఉన్నాయి. 1,21,677 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటికే వీరి వివరాలను మెప్మా అధికారులు సేకరించారు. ప్రొఫైలింగ్ యాప్‌లో నమోదు చేశారు. వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులపై నివేదికలు సిద్ధం చేశారు. ఆ కుటుంబ ఆదాయమెంత? మహిళలకు ఇతర రంగాల్లో నైపుణ్యం ఏమైనా ఉందా? అని పరిశీలిస్తారు. కుటుంబ తలసరి ఆదాయం ఉంటే మాత్రం పెంపే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి సంక్షేమ పథకాలు అందిస్తారు. వాటితో పాటు వారి నైపుణ్యం పెంచే వీలుగా రాయితీతో కూడిన బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తారు. తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడతారు. మరోవైపు మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే బ్యాంకు లింకేజీ రుణాలను మరింత పెంచనున్నారు.

రాజాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి)

కుటుంబంలో మహిళల పాత్ర అత్యంత కీలకం. మహిళల అభివృద్ధిపైనే కుటుంబాల ప్రగతి ఆధారపడి ఉంటుంది. తద్వారా దేశాభివృద్ధి సాధ్యపడుతుంది. అందుకే కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఉపాధి కల్పించి.. చిరు పారిశ్రామిక వేత్తలుగా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దాని కోసం 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసింది ప్రభుత్వం. 'జీవనోపాధుల జాతర' పేరిట మెప్మా ఆధ్వర్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని మహిళల పైనే దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలతో పాటు విజయనగరం నగర పాలక సంస్థలో సర్వే ప్రారంభమైంది. డిసెంబరు 22న ప్రారంభమైన ప్రత్యేక సర్వే ఈ నెల 31తో ముగియనుంది.

● చురుగ్గా ప్రణాళిక..

ఉమ్మడి జిల్లాలోని ఏడు పురపాలికల్లో 406 సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించాల్సి ఉంది. ఈ ప్రక్రియ దాదాపు ఒక కొలిక్కి వచ్చింది. ప్రస్తుతం ప్రతి ఇంట్లో మహిళల గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. నైపుణ్యాలకు తగ్గట్టు శిక్షణ ఇస్తాం. వారి ఆదాయమే పెంపు లక్ష్యంగా శిక్షణ కొనసాగనుంది. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-చిట్టిరాజు, మెప్మా పీడీ, విజయనగరం

● శుభ పరిణామం..

ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెట్టడం శుభ పరిణామం. ప్రోత్సాహం లేక ఇబ్బంది పడుతున్నాం. మాలాంటి వారికి రాయితీ రుణాలు అందిస్తే ఉపాధిని మరింత మెరుగుపరచుకోగలం. ప్రభుత్వం ముందుకొచ్చి సాయం చేస్తామంటే అంతకంటే సంతోషం ఏముంటుంది? వీలైనంత త్వరగా రాయితీ రుణాలు అందించాలి.

-జి.పద్మ, మహిళా సంఘ సభ్యురాలు, రాజాం

● చేయూతనందించాలి..

మహిళలతోనే కుటుంబం రాణిస్తుందన్న విషయాన్ని గుర్తించాలి. అందుకే మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా చేయాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం ముందుకు రావడం మంచిదే. వీలైనంత త్వరగా నైపుణ్య శిక్షణ, రాయితీ రుణాలు వంటివి అందించాలి.

-వి.కళావతి, మహిళా సంఘ సభ్యురాలు, రాజాం



ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

చెట్టు కిందే చదువులు

- కటిక నేలపైనే విద్యార్థులు

రామభద్రపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో చదువులు ఎలా ఉంటున్నాయో ఈ చిత్రం చూస్తే అర్థమవుతుంది. నాణ్యమైన విద్యను అందించడం కోసం ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నామని ప్రభుత్వాలు చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో అది పూర్తి స్థాయిలో అమలు కావడం లేదనడానికి ఇదే తార్కాణం. మండల పరిధిలోని గొల్లలపేట పంచాయతీ జోగిందొరవలస ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం లేకపోవడంతో మూడేళ్లుగా చెట్టు కిందనే ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ గ్రామంలో ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2021లో నేలమట్టం చేశారు. అప్పటి నుంచి విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. కొన్ని రోజుల పాటు ఇక్కడి ప్రార్థనా మందిరంలోనూ.. మరికొన్ని రోజులు పూరిపాకలోనూ తరగతులు నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాల కొత్త భవనాల నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేశారు. ఆ పనులు ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడంతో 2, 3, 4, 5 తరగతులను మండుటెండలో నిర్వహిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకటో తరగతిని మాత్రం అసంపూర్తిగా ఉన్న భవనంలోనే నిర్వహిస్తున్నారు. గిరిజనులు కావడంతోనే తమ గ్రామంపై వివక్ష చూపుతున్నారని స్థానికుడు జాడయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. పక్కనే ఉన్న కర్రిందొరవలసకు చెందిన కొంతమంది విద్యార్థులు కూడా ఈ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒక గిరిజన గ్రామంలో ఇంతమంది విద్యార్థులు చదువుతున్నా.. కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిదులు, అధికారులు స్పందించి తమ గ్రామంలో ఉన్న పాఠశాలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌ను సంప్రదించగా... పాఠశాల భవనాలతో పాటు మరుగుదొడ్ల సమస్య కూడా వేధిస్తోందని తెలిపారు.



అసంపూర్తిగా ఉన్న భవనాలు

తప్పు చేసినా వదిలేస్తారా?



చిన్నారికి టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

- టీకాలు వేయని వారిపై కంటితుడుపు చర్యలు
- స్థాన చలనంతో సరి
- ఇదీ జిల్లా వైద్యశాఖ అధికారుల తీరు

శృంగవరపుకోట రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి)

'తప్పు చేసిన వారిపై చర్యలు ఉండవా?'... 'ఈ ప్రభుత్వంలో తప్పుచేసిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవ'ని తరచూ చెప్పే ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలేనా?'.. ఇవీ బొడ్డవర పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారుల తీరుపై వ్యక్తమవుతున్న సందేహాలు. గిరిశిఖర పంచాయతీ దారపర్తి పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో 149 మంది చిన్నారులకు టీకాలు వేయకుండానే... వేసినట్లు రికార్డుల్లో రాశారు బొడ్డవర కో-లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది. ఫలితంగా ఆ చిన్నారులకు విషజ్వరాలు ప్రబలడానికి కారకులయ్యారు. వీరు చేసిన పనికి అక్కడి చిన్నారులు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కోవడంతో పాటు ఎప్పుడూ చూడని విధంగా మీజిల్స్ (తట్టు) లాగా వారి శరీరాలపై కనిపించాయి. కొండపై టీకాలు వేయలేదని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన తర్వాత జిల్లా వైద్య యంత్రాంగం కొండలపైకి పరుగులు తీసింది. అక్కడ ఉన్న 149 మంది చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆపసోపాలు పడి 120 మంది వరకు టీకాలు వేసింది. మిగిలిన వారిని వదిలేసిందనే వినిపిస్తున్నాయి. టీకాలు వేయడంలో అలసత్వం వహించిన వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టి.. ఇక నుంచి ఇలా ఎవరూ చేయకుండా జిల్లా అధికారులు వ్యవహరిస్తారని... ఇకపై గిరిజన గ్రామాల్లో సక్రమంగా వైద్యసేవలు అందుతాయని ప్రజలు భావించారు. కానీ దీనిపై విచారణకు కొద్ది రోజుల్లో సెంట్రల్ కమిటీ వస్తోందన్న సమాచారం నేపథ్యంలో కంటితుడుపు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ కో-లొకేటెడ్ పిహెచ్‌సీ వైద్యురాలు శిరిష ఇప్పటికే జామి మండలం అలమండలో ఇన్‌చార్జి వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెను అక్కడే విధులు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. ఎంపీహెచ్‌వో సన్యాసినాయుడు కొత్తవలసలో పనిచేస్తూ... ఇక్కడ డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. తిరిగి ఆయనను కొత్తవలస పంపించారు. వైద్యురాలి స్థానంలో డాక్టర్ వెంకటేష్‌ను నియమించగా... ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ చర్యలపై గిరిజన యువత మాట్లాడుతూ చిన్నారుల ప్రాణాలతో వైద్యులు, సిబ్బంది ఆటలాడుకుంటే జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. పిల్లలకు టీకాలు వేయకుండా వారి భవిష్యత్‌తో ఆడుకున్న వారిపై చర్యలు తీసుకోకపోగా.. మైదాన ప్రాంతాల్లో ఉంచారని.. ఇదేం పద్ధతి అని వాపోయారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. గిరిశిఖర గ్రామాల్లో విషజ్వరాలకు గురైన వారి నుంచి రక్తం సేకరించి విజయవాడ పంపించామని చెప్పి నెలరోజులు దాటుతోందన్నారు. ఈ నివేదికను ఎందుకు బయట పెట్టడం లేదని ప్రశ్నించారు.



పార్లు గ్రామం

విచారణ ముగిసింది..

దీనిపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి వివరణ కోరగా...ఈ ఘటనకు సంబంధించి విచారణ ముగిసిందన్నారు. అక్కడి పీహెచ్‌సీ వైద్యురాలిని అలమండలో నియమించామని... ఎంపీహెచ్‌ఓ సన్యాసినాయుడును కొత్తవలసలో నియమించామని అన్నారు. బొడ్డవరకు కొత్త వైద్యుడిని నియమించామని చెప్పారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

గంట ముందే పరీక్ష కేంద్రంలోకి...

- పదో తరగతి విద్యార్థులకు అనుమతి
- ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం
- విద్యాశాఖ అధికారుల నిర్ణయం

బొబ్బిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఇకపై గంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి వెళ్లవచ్చు. ఈ మేరకు విద్యాశాఖాధికారులు వెసులుబాటు కల్పించారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ విద్యార్థులను అరగంట ముందు మాత్రమే పరీక్ష కేంద్రాలలోకి అనుమతించేవారు. దూర ప్రాంతాల నుంచి వెళ్లే విద్యార్థులంతా పరీక్ష కేంద్రం గేట్లు తెరిచే వరకు ఎండలో మగ్గాల్సి వచ్చేది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఇక మీదట గంట ముందుగానే పరీక్ష హాలులోకి విద్యార్థులను అనుమతించాలని జిల్లా విద్యాశాఖాధికారులు మౌఖిక ఆదేశాలిచ్చారు. ఉదయం పూట ఎండ బారిన పడి... దానికి ఒత్తిడి తోడైతే విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని గ్రహించిన అధికారులు ఉపశమనం కల్పించారు. విద్యార్థుల సౌలభ్యం కోసం డీఈఓ ఈమేరకు ఆదేశాలిచ్చారని డిప్యూటీ డీఈఓ మోహనరావు, ఎంఈఓ చల్లా లక్ష్మణరావులు తెలిపారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పరీక్ష కేంద్రం ముందు ఎండలో వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

తోటపల్లిలో ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

గరుగుబిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వర, కోదండరామ స్వామి దేవస్థానాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉభయ దేవాలయాల్లో విశ్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యాహవచనం, పరిషత్ రక్షా బంధనం, అష్టోత్తర శతకలశ మండపారాధనను ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు, ప్రతిష్ఠాపకులు హరికృష్ణమాచార్యులు నిర్వహించారు. అభిషేకాల అనంతరం ప్రధాన ఆలయ శిఖర అర్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలను చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, ఆలయాల అభివృద్ధి సేవా ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు, డి.ధనుంజయ నాయుడు, ఎం.పకీరు నాయుడులు మాట్లాడుతూ దేవస్థానాల పరిధిలో పునః ప్రతిష్ఠ అనంతరం 41 రోజుల పండగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు. ఆలయ ప్రాంగణం గోవింద నామ స్మరణతో మార్మోగింది.



భక్తి శ్రద్ధలతో చండీయాగం

వీరఘట్టం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండువ సెంటర్‌లో ఉన్న షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం సాయినాథ ఆరాధన, లక్ష్మీకుబేర సహిత దత్తాత్రేయ కల్యాణం, చండీయాగం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై పూజలు చేశారు. జోస్యుల రఘునాథశర్మ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ వరకు పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రి సంధ్యారాణి, విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు

ముఖ్యమంత్రితో మన నేతలు

విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన సభ్యులకు సీఎం చంద్రబాబు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

హామీలు నెరవేరిస్తే ఆమోదిస్తాం

●తేల్చి చెప్పిన అప్పన్నదొరపాలెం గ్రామస్థులు ● భూసేకరణకు గ్రామసభ నిర్వహించిన అధికారులు



ఆర్డీవోను ప్రశ్నిస్తున్న గ్రామస్థుడు

కొత్తవలస, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఇచ్చిన హామీలను నెరవేరిస్తే భూసేకరణకు ఆమోదం తెలుపుతామని మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామస్థులు తేల్చి చెప్పారు. గురువారం అప్పన్నదొరపాలెం ప్రాంతంలో గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రం ఏర్పాటు సంబంధించిన భూసేకరణకు విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ నాడు గిరిజన వర్సిటీ అంటే సాగు భూములు ఇచ్చాం.. ఇప్పుడు గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రమంటూ మోసం చేస్తారా? అని నిలదీశారు. గిరిజనులంటే ప్రభుత్వాలకు ఎందుకు చిన్నచూపు అని ప్రశ్నించారు. గిరిజన వర్సిటీ కోసం భూసేకరణ చేసిన అధికారులు ఎన్నో హామీలు ఇచ్చారన్నారు. వాటిలో ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. మళ్లీ ఇప్పుడు గ్రామసభ ఎలా నిర్వహించడానికి వచ్చారని అడిగారు. గతంలో భూమికి భూమి ఇస్తామని, భూములు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని గిరిజనులకు ఉపాధి కల్పిస్తామని హామీలు ఇచ్చిన మాటను ప్రస్తావించారు. అప్పటి హామీలే నెరవేర్చకపోతే.. ఇప్పుడెలా భూములు ఇస్తామని నిలదీశారు. 2018లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం లిఖిత పూర్వకంగా స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో కీర్తి తెలిపారు. గ్రామసభకు తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఆర్ఐ రాజేశ్, సర్పంచ్ జోడు రాములమ్మ, అప్పన్నదొర పాలెం, తమ్మన్న మెరక, జోడుమెరక ప్రజలు హాజరయ్యారు.

జిల్లాను యూనిట్‌గా తీసుకోండి

●అసెంబ్లీలో ఎమ్మెల్యే కోండ్రు



రాజాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జిల్లాను యూనిట్‌గా చేస్తే బాగుంటుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. గురవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ సామాజిక వర్గాలకు ఎన్టీఆర్ నుంచి నేటి వరకూ టీడీపీ అండగా నిలుస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు దళితుల పట్ల వివక్షతను నిర్మూలించేందుకు అప్పట్లో సీఎం చంద్రబాబు.. జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించారన్నారు. దళితుల్లో మాల కులానికి చెందిన జీఎంసీ బాలయోగి లోక్‌సభలో స్పీకర్‌గా, ప్రతిభాభారతిని శాసన సభలో స్పీకర్‌గా చేసిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబు ఘనతేనన్నారు. టీడీపీ హయాంలోనే రెసిడెన్సియల్ స్కూల్స్ వచ్చాయన్నారు. లక్షలాది మంది గ్రూప్ వన్ అధికారులు నేడు ఉన్నారంటే అది టీడీపీ కృషి ఫలితమేనన్నారు. 28 సంక్షేమ పథకాలు దళితులకు టీడీపీ అమలు చేస్తే, వైసీపీ వాటిని రద్దుచేసిందన్నారు. దళిత కాలనీల అభివృద్ధి, ఎస్సీ-ఎస్టీ మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడింది టీడీపీ మాత్రమేనని అసెంబ్లీలో కోండ్రు ప్రస్తావించారు.

అప్పు ఇవ్వలేదని చంపేశారు

●వృద్ధురాలి హత్యకేసులో నలుగురి అరెస్టు

●వివరాలు వెల్లడించిన బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి



మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి

గజపతినగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మెంటాడ మండలం రెల్లిగూడెం గ్రామానికి చెందిన రాళ్లపూడి అంకమ్మ హత్యకేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. రెల్లిగూడెం గ్రామానికి చెందిన రాళ్లపూడి అంకమ్మ చుట్టుపక్కల వారు అప్పు అడిగితే రూ.500 నుంచి వెయ్యి వరకు ఇస్తుండేది. అదే గ్రామానికి చెందిన ధనాల రాములమ్మ ఇంటి అవసరాల కోసం కొంత మొత్తం అప్పుగా ఇవ్వాలని అంకమ్మను కోరింది. అయితే, ఆమెకు అప్పు ఇచ్చేందుకు అంకమ్మ ఇష్టపడలేదు. దాంతో రాములమ్మ పగ పెంచుకుంది. ఎస్.కోటలో ఉన్న ధనాల రాము, అదే గ్రామానికి చెందిన ధనాల దుర్గమ్మ, బొడ్డు సాయంతో ఆమెను చంపేయాలని నిర్ణయించుకుంది. రాత్రి నిద్రిస్తున్న సమయంలో అంకమ్మ చేతులను దుర్గారావు, కాళ్లను బొడ్డు అదిమిపట్టుకున్నారు. ధనాల రాములమ్మ, రాములు.. ఆమె గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేసి ప్రాణం తీసేశారు. నిందితులు గురువారం గ్రామ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో లొంగిపోయారు. వారు ఆండ్ర పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారని తెలిపారు. అంకమ్మను గొంతు పిసికి చంపినట్టు పోస్టుమార్టం నివేదిక రావడంతో ఎస్పీ ఆదేశాల మేరకు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. తుదకు నిందితుల నుంచి పావు తులం బంగారు ముక్కు పుడకతో పాటు రూ.740 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సీఐ రమణ, ఆండ్ర ఎస్ఐ సీతారాం పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు

సంతకవిటి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుళ్ల సీతారాంపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. సిరిపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చేపలు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా గుళ్ల సీతారాంపురం వద్ద కర్రలతో వస్తున్న ట్రాక్టర్ వీరిని ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాలాడ గ్రామానికి చెందిన వంకల రాజారావు, గునుపూరు గోవింద, సిరిపురం గ్రామానికి చెందిన కోరాడ రాజుమల్లయ్యపేటలో కూలి పనులు చేసిన అనంతరం చేపలు కొనుగోలు చేసి తిరిగి సిరిపురం వస్తుండగా గుళ్ల సీతారాంపురం దేవాలయం జంక్షన్ వద్ద కర్రల ట్రాక్టర్ వీరిని ఢీ కొంది. దాంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. వంకల రాజారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డెంకాడ మండలం గుణుపూర్‌పేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పెంటపల్లి రామలింగేశ్వరరావును అరెస్టు చేసి, అతడి నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాద్రి తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈ సీలు నాయుడు, భారతి పాల్గొన్నారన్నారు.

కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయండి



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, రాజు డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వం డిగ్రీ కళాశాల వద్ద ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగా 2019లో నగరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఆరేళ్ల కళాశాల ప్రారంభం అయినప్పటికీ, సొంత భవనం కేటాయంచకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సొంత భవనం కేటాయించాలని లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు సౌమ్య, సోమేష్, గుణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేపడుతున్న డీఎస్పీ

వేపాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వల్లంపూడి ఎస్ఐ దేవిపై నమోదైన అట్రాసిటీ కేసుపై విజయనగరం ఎస్సీ సెల్ డీఎస్పీ వీరకుమార్ గురువారం మండలంలోని గుడివాడలో విచారణ చేపట్టారు. విచారణ కోసం గ్రామంలో రచ్చబండ వద్దకు డీఎస్పీ చేరుకుని ఫిర్యాదుదారులు, సాక్షులు కోసం వేచి చూశారు. ఎవరూ రాకపోవడంతో ఎస్సీ కాలనీలోని ఫిర్యాదుదారుడి ఇంటికి డీఎస్పీ వెళ్లి వాకబు చేశారు. ఇంట్లో లేరని తెలుసుకుని వెనుదిరిగారు. వేణుగోపాలస్వామి తీర్థంలో ఎస్ఐ దేవి, బాధితుడు మోహన్ మధ్య జరిగిన సంభాషణ, గొడవను డీఎస్పీకి కుటుంబ సభ్యులు వివరించారు. విచారణలో డీఎస్పీ వెంట ఎస్.కోట రూరల్ సీఐ అప్పల నాయుడు, బాధితుడి తరఫు న్యాయవాది, గాలి ఈశ్వరరావు, వల్లంపూడి పోలీసులు తదితరులు ఉన్నారు.

భూ ఆక్రమణల ఫిర్యాదుపై దర్యాప్తు

బొండపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగసింగిపేటలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు అదే గ్రామానికి చెందిన బగ్గా ఎర్రయ్య ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ అంబేడ్కర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో గురువారం తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ప్రభుత్వ భూమి, జిరాయితీ భూమి వివరాలను మండల సర్వేయర్, సచివాలయం సర్వేయర్, వీఆర్వో సరి చూశారు. ప్రభుత్వ భూములు, జిరాయితీ భూములకు మధ్య హద్దులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆరోవో ప్రసాద్, సచివాలయ సర్వేయర్ చక్రపాణి ఉన్నారు.



పాలభిషేకం చేస్తున్న మీ సేవ నిర్వాహకులు

లోకేశ్ చిత్రపటానికి పాలభిషేకం

వంగర, మార్చి20 (ఆంధ్రజ్యోతి): మీ సేవ కేంద్రాల్లో అన్ని సేవలకు అవకాశం కల్పించినందుకు ఐటీ శాఖా మంత్రి లోకేశ్‌కు గురువారం మండల కేంద్రంలో మీ సేవ నిర్వాహకులు పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మీ సేవ నిర్వాహకులు రవి, రాంబాబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ త్రినాథరావు ప్రకటనలో తెలిపారు. లైన్‌పై చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతు పనుల నేపథ్యంలో నెల్లిమర్ల, జరజాపుపేట, రామతీర్థం, మొయిద జంక్షన్, థామస్‌పేట, లక్ష్మీదేవిపేటల్లో సరఫరా ఉండదన్నారు.

23న ఉద్యోగ మేళా

శృంగవరపుకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈనెల 23న శృంగవరపుకోట వివేకానంద కళాశాలలో సంకల్ప ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. టెన్త్ నుంచి పీజీ, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చని టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ తెలిపారు. వివరాలకు 9988853335 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.1.18 లక్షలు

రాజాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో హుండీని గురువారం లెక్కించారు. 55 రోజులకు గానూ రూ.1,18,837 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో పి.శ్యామలరావు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో పోలిపల్లి పైడితల్లి అమవారి ఈవో బీవీ మాధవరావు, కమిటీ చైర్మన్ వానపల్లి నర్సింగరావు, అర్చకులు ఆర్.శ్రీనివాసరావు, రామచంద్రరావు, టి.ఇందిర ఉన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలపై అవగాహన

రాజాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తను నివారించడానికి ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మండలంలోని సోపేరు ఎస్‌డబ్ల్యూపీసీలో నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులు, 35 మంది క్లాప్ మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు శిక్షణ

విజయనగరం రింగురోడ్డు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో జీవన రాణి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. స్కానింగ్ కేంద్రాలు నిర్వహించాల్సిన రికార్డులు, రిజిస్ట్రేషన్ కోసం చేయాల్సిన పనులు, చేయకూడని పనులు, ఫారం-ఎఫ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో కె.రాణి, పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి అచ్యుతకుమారి, చినతల్లి పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష తేదీ మార్చండి

శృంగవరపుకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షల తేదీని మార్చాలని విశ్వహిందూ పరిషత్ సభ్యుడు పైడప్పయ్య, బీజేపీ నాయకులు డి.సూర్యారావు, శ్రీను తదితరులు కోరారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి రోజు పరీక్ష నిర్వహించడం తగదన్నారు. గురువారం శృంగవరపుకోట తహసీల్దార్ ఎం.అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు.

రెల్లి ఉపకులాలకు న్యాయం చేయండి

విజయనగరం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రెల్లి అనుబంధ ఉపకులాలకు న్యాయం చేయాలని సోము మురళీమోహన్ డిమాండ్ చేశారు. గురువారం లంకాపట్టణంలోని రౌతువీధిలో రెల్లి, ఉపకులాలకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు



ఇఫ్తార్ విందు ఇస్తున్న డాక్టర్ ఖలీల్‌బాబు

విజయనగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా నగరంలోని ముస్లింలు ఉపవాస దీక్షలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉపవాస దీక్షలు ముగిసిన తరువాత సాయంత్రం వేళల్లో ఇఫ్తార్ విందులకు హాజరవుతున్నారు. జామియా మసీదు, బాబామెట్టలోని ఖాదర్‌బాబా దర్గా, కంటోన్‌మెంట్ ఆబాద్‌వీధి తదితర మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఖలీలుల్లా షరీఫ్‌షా తాజ్‌ఖాదరీ, సాబిరీ మాట్లాడుతూ హృదయ ప్రక్షాళన కోసం ఉపవాసం అవసరమన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం బాబామెట్టలోని ఖదర్‌బాబా దర్గాలో 19వ రోజు ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఖలీలుల్లా షరీఫ్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఆరంభం నుంచి ప్రతిరోజు ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం భక్తులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్‌బాబు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో వివక్ష తగదు

చీపురుపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాల మంజూరుకు అర్హతలు నిర్దేశించడంలో ప్రభుత్వం వివక్ష ప్రదర్శించిందని నియోజకవర్గ తెలగ సంఘం రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ సర్విశెట్టి వెంకటేశ్వరరావు, ప్రతినిధులు ఎం.రామకృష్ణ, మల్లెంపూడి శ్రీనివాసరావు, నరసింగరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. రుణాలు పొందేందుకు అన్ని కులాలకు గరిష్ట వయోపరిమితిని 60 ఏళ్లగా నిర్ణయించిన ప్రభుత్వం.. కాపు, తెలగ, బలిజ సామాజిక వర్గాల వారికి 50 ఏళ్లకు పరిమితం చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. వయోపరిమితిలో తేడా వల్ల వేలాది మందికి ఉపాధి అవకాశాలు దూరమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం చేయడానికి వెనుకాడబోమని వారు స్పష్టం చేశారు.

జేఎన్‌టీయూలో టెక్నికల్ సింపోజియం



కార్తిక్‌రెడ్డిని అభినందిస్తున్న అధ్యాపకులు

విజయనగరం క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ గురజాడలో గురువారం టెక్నికల్ సింపోజియం నిర్వహించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సింపోజియంను ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు ప్రారంభించారు. వివిధ కళాశాలలకు చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి.కార్తిక్‌రెడ్డి హాజరయ్యారు. ఆటోమోటివ్ ఇంజిన్ టెక్నాలజీ, 3 డీ మోడలింగ్, యూజింగ్ కేటీయూ, ఏరో డైనమిక్స్ తదితర అంశాలను వివరించారు.

పోడు భూములకు పట్టాలివ్వండి



మాట్లాడుతున్న సూర్యనారాయణ

శృంగవరపుకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారపర్తి, మూల బొడ్డవర, పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలతో పాటు వెంకటరమణపేట పంచాయతీ శివారు మల్లెపూడి గ్రామానికి చెందిన గిరిజనుల సాగులోని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గిరిజనులతో కలిసి ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, ముత్యాలు తదితరులున్నారు.

రోజుకు రూ.342కు కుదిరిన కాంట్రాక్టు

శృంగవరపుకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మేజర్ పంచాయతీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు రోజువారీ కూలీ చెల్లించేందుకు గురువారం టెండర్‌ను నిర్వహించారు. అందరి కంటే పెదగాడి అప్పలరాజు రోజు కు రూ.342 చెల్లించేందుకు టెండర్ వేశాడు. దీంతో అతనికి కాంట్రాక్టు దక్కింది. అందరికి కంటే ఎక్కువగా వాకాడ శివశంకర ప్రశాంత్ రూ.369, ఆ తరువాత వాకాడ రమణ రూ.359, గన్ను శ్రీను రూ.350 చెల్లించేందుకు టెండర్‌లు దాఖలు చేశారు. కాంట్రాక్టు డ్రైవర్ కాంట్రాక్టు వెలుచూరి స్వామినాయడు రూ.400, ఎలక్ట్రికల్ సహాయకుడు కాంట్రాక్టు గనివాడ అప్పారావు రూ.400, పార్కు వాచ్‌మాన్ కాంట్రాక్టు మోపాడ అప్పారావు రూ. 380, కాకి యూనిఫాం కుట్టుకూలితో సహ రూ.2,800కు బెలగం సంతోష్ పొందారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లిమర్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు చేసు కోవాలని ప్రిన్సిపాల్ బి.ఉమ ఒక ప్రకటనలో కోరారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఎంపీసీ) ప్రవేశానికి, ఇతర తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి ఏప్రిల్ 4 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7901098524 సంప్ర దించాలని ఆమె సూచించారు.

● మెరకముడిదాం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విద్యాలయం ప్రత్యేకాధికారి గౌస్య బేగం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఏప్రిల్ 11 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా వార్షికోత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రింగురోడ్డు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరానికి చేరువలోని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామానారాయణంలో గురువారం 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సర్వదేవత మూర్తులకు విశేష స్నపనలు, నవగ్రహ పూజలు, వర్షవర్ధన హోమం, పూర్ణాహుతి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి, పద్మశ్రీ, వీఆర్‌వో రమణ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

విజయనగరం రింగురోడ్డు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థలో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కమిషనర్ పి.నల్లనయ్య గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆండ్ర జలాశయం నుంచి విడుదలైన నీరు చంపావతికి చేరుకుందన్నారు. కలెక్టర్ అంబేడ్కర్ సూచనలతో ఆండ్ర ప్రాజెక్టు గేట్-2 నుంచి పది రోజుల కిందట నీటిని విడుదల చేశారన్నారు. ఆండ్ర జలాశయం నుంచి నేరుగా మర్రివలస, పిట్టాడ, మెంటాడ, గజపతినగరం, డోలపేట, జీవపేట మీదుగా మొత్తం 40 కిలోమీటర్లు ప్రవహించి నెల్లిమర్లలోని చంపావతి నది వద్ద అమృత ట్యాంకుల వద్దకు చేరుతుందన్నారు. అక్కడ ఇన్‌ఫిల్టరేషన్ ఊట బావుల వద్ద నుంచి నెల్లిమర్ల మాస్టర్ పంపుహౌస్ ద్వారా విజయనగరం నగరపాలక సంస్థకు నీటి పంపిణీ జరుగుతుందని వివరించారు. ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా అవసరమైన నీటిని మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

మెరకముడిదాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.రాంబాబు కోరారు. మండలంలోని చినబంటుపల్లి పాఠశాలలో గురువారం స్థానిక ఉపాధ్యాయులతో కలిసి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు చట్టం మాదిరి డీఏ, పీఆర్‌సీ, ఐఆర్‌సీ, ఏపీజీఎల్ఐ, పీఎఫ్, పార్ట్ పేమెంట్ తదితర ఆర్థిక పరమైన అంశాలపై ఎప్పటికప్పుడు చట్టం చేయాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనువాసులునాయుడును గెలిపించడంతో మాకు మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు ఆర్.సింహాద్రి, టి.మహేశ్, ఎ.శ్రీహరి, వై.శ్రీను తదితరులున్నారు.

స్వచ్ఛ ఓటర్ల జాబితాలకు కృషి చేయండి

నెల్లిమర్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా నాణ్యత, స్వచ్ఛత మెరుగుపరచడానికి బీఎల్‌వోలు నిరంతరం కృషి చేయాలని నియోజకవర్గ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ బి.సుదర్శనరావు సూచించారు. బీఎల్‌వోలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీ పక్కాగా జరగాలన్నారు. ఓటర్లు, అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధుల సలహాలను స్వీకరించాలన్నారు. సమావేశంలో హెచ్‌డీటీ రవిశంకర్, ఎన్నికల డీటీ జగన్నాథరావు, ఈవోపీఆర్‌డీ జగన్నాథం పాల్గొన్నారు.

● బొండపల్లి: తప్పులు లేకుండా పక్కా ఓటరు జాబితాలను ప్రతీ బీఎల్‌వో తయారు చేయడానికి కృషి చేయాలని ఈఆర్‌వో ప్రమీలగాంధీ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని బీఎల్‌వోలకు ఓటరు జాబితాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 52 మంది బీఎల్‌వోలకు గానూ 38 మంది హాజరు కావడంపై ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా మేనేజర్

విజయనగరం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అపరాలు పండించే రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నడిపేన వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం బొబ్బిలి సహకార సంఘం, రాజాంలోని సంతకవిటిలో మినుములు, పెసలకు సంబంధించి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. జేసీ ఆదేశాలతో అన్ని సహకార సంఘాల్లో ఎఫ్‌పీవోలను కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

విజయనగరం దాసన్నపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ విజయనగరంలో సీపీఎం నాయకులు గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.రమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దిగువకొండపర్తిలో 'నవోదయం'

విజయనగరం క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సారా నియంత్రణలో గ్రామస్థుల పాత్ర కీలకమని విజయనగరం సర్కిల్-2 రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయలక్ష్మి అన్నారు. నవోదయం-2.0లో భాగంగా గురువారం గంట్యాడ మండలం దిగువకొండపర్తిలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతమ్మ, పెద్దలు సన్యాసిరావు, వీఆర్‌వో గణపతి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ, ఫారెస్టు బీట్ అధికారి సత్యనారాయణ, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా

గజపతినగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మధుపాడ గ్రామంలో రైతు భరోసా కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. వైసీపీ హయాంలో గ్రామానికి దూరంగా రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టారు. అప్పుడప్పుడు అధికారులు భరోసా కేంద్రానికి వెళ్లి వస్తుంటారు. దీంతో రాత్రి సమయాల్లో మందుబాబులు అక్కడే మద్యం తాగుతున్నారు. భవనం చుట్టూ ఖాళీ మద్యం సీసాలే ఇందుకు నిదర్శనం. ఇతర గ్రామాల నుంచి ఇక్కడకు యువకులు చేరుకుని గంజాయి సేవిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాత్రి సమయాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రైతు భరోసా కేంద్రం ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు

మాదకద్రవ్యాలతో సంపాదించిన ఆస్తుల జప్తు

(ఐదో పేజీ తరువాయి)

40 మందికి న్యాయస్థానాల్లో శిక్ష ఖరారుకాగా, సుమారు 20 మందికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షలు విధించారు. గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించే ఆస్తులను జప్తు చేస్తాం. ఇప్పటికే విజయనగరం, అనకాపల్లి జిల్లాలో చెరొకటి కేసుల్లో ఆస్తులు జప్తుచేశాం. రేంజ్ పరిధిలో గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన 86 మందిని డి-అడిక్షన్ కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ ఇచ్చామ'ని తెలిపారు. 'గంజాయి సాగును నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ పంటలకుగాను రబీ సీజన్‌లో 4.68 ప్లాంట్లలో 22 రకాల విత్తనాలను 11ఎకరాల్లో సాగుకు అందజేశాం. ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా 20మండలాల్లో 10,256 మంది రైతులు పంటలు పండించేందుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే రాజ్మా చిక్కుడు విత్తనాలు 4,496 కిలోలు పంపిణీ చేశామ'ని డీఐజీ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు పి.శ్రీనివాసరావు, పి.సౌమ్యలత, అంకిత సూరన పాల్గొన్నారు.

వేగావతిపై చెక్‌డామ్ నిర్మించాలి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాడంగి మండలం పాల్తేరు, బొబ్బిలి మండలం అలజంగి గ్రామాల మధ్య వేగావతి నదీ పరివాహక ప్రాంతంలో చెక్‌డ్యామ్ కమ్ కాజ్‌వేను నిర్మించాలని ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. వేగావతి పరివాహక ప్రాంతంలో సుమారు 1,500 సాగునీటి బోర్లు ఉన్నాయన్నారు. బాడంగి మండలానికి చెందిన 18 గ్రామాలకు, గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలానికి చెందిన 55 గ్రామాలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు సీపీడబ్ల్యూఎస్ పథకం ఉందని చెప్పారు. అటు తాగునీటి అవసరాలను, ఇటు సాగునీటి అవసరాలను తీర్చుతున్న వేగావతి నదిలో భూగర్భ జలాలను వృద్ధి చెందించేందుకు అక్కడ చెక్‌డ్యామ్ కమ్ కాజ్‌వేను నిర్మించాలని ఆయన కోరారు.

తోటపల్లి ఆధునికీకరణ పూర్తి చేయాలి

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడారు. నాగావళి నదిపై ఎడమ ప్రధాన కాలువ, కుడి ప్రధాన కాలువల ద్వారా 64వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడానికి 1908లో తోటపల్లి రెగ్యులేటర్ నిర్మించారని చెప్పారు. 2018లో టీడీపీ ప్రభుత్వంలో తోటపల్లి కుడి, ఎడమ ప్రధాన కాలువల ఆధునికీకరణకు రూ.195.34 కోట్లు అంచనా విలువతో ఆధునికీకరణ పనిని మంజూరు చేశారని తెలిపారు. సదరు పని 23 శాతం జరిగిందని, మొత్తం రూ.41కోట్లు పని జరగగా, రూ.23కోట్లకు సంబంధించి బిల్లు విడుదల అయ్యిందని, రూ.18కోట్లు విడుదల కావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరారు.

దళితుల పక్షపాతి చంద్రబాబు

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దళితుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగి తీరాలన్న సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణపై 30ఏళ్ల పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు త్యాగం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు. జంబూ ద్వీపాన్ని పాలించిన వ్యక్తి దళితుడని, వివాహాలు జరిగిన తర్వాత చూసే అరుణజ్యోతి నక్షత్రం దళిత బిడ్డ అని తెలిపారు. కృష్ణుని మూడో భార్య, జాంబవంతుని కుమార్తె దళిత బిడ్డని గుర్తు చేశారు. దళితులకు చెందిన కొన్ని కులాల్లో యూనివర్శిటీ మెట్లు ఎక్కని వారు ఉన్నారని, ఆ కులాల్లో ఒక డాక్టర్ లేరని, ఉన్నత ఉద్యోగులు లేరన్నారు.

ఇంటింటికి కుళాయి మంజూరు చేయాలి



నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాలకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి కుళాయి మంజూరు చేసి, ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. పాలకొండ నగర పంచాయతీగా మారి సుమారు 12ఏళ్లు కావస్తుందన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు సమస్యతో పాటు మురుగు కాలువలు, రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గారమ్మ కాలనీ, రెల్లివీధి మహిళలు మాట్లాడుతూ తాగునీటి సమస్య వెంటనే పరిష్కారించాలని కోరారు. అనంతరం కమిషనర్ టి.జయరాంకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి రాధ, భవానీ, సునీత, పి.శంకుతల, పి.దాలప్పమ్మ, కె.పద్మ, వి.ఝాన్సీ, గౌరమ్మ, ఎం.పద్మ, సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము, అధ్యక్షులు బి.వాణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు



తహసీల్దార్‌తో చర్చిస్తున్న గృహ నిర్మాణశాఖ ఈఈ సోమేశ్వరరావు

గరుగుబిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గృహ నిర్మాణాల వేగవంతానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, రావుపల్లి తదితర గ్రామాల్లోని నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పి.బాల దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారు. మంజూరైన లబ్ధిదారులకు కుల ధ్రువీకరణ పత్రాలు, అలాగే పొజిషన్ పత్రాలు సకాలంలో అందించేందుకు చొరవ చూపాలని కోరారు. దీనిపై స్పందించి తహసీల్దార్.. క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పత్రాలను సిద్ధం చేయాలని వీఆర్వోలను ఆదేశించామని చెప్పారు. అనంతరం ఈఈ సోమేశ్వరరావు మాట్లాడుతూ పక్కా గృహాల నిర్మాణాలకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం మంజూరు చేసిందన్నారు. నిర్మాణాలు మే నెలాంతానికి పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, జేఈ వంగపండు అఖిల్‌నాయుడు, మరిశర్ల భాస్కరరావు ఉన్నారు.

నోటి పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి

బెలగాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నోరు పరిశుభ్రంగా ఉంటే మన శరీరం ఆరోగ్యంగా ఉండడానికి దోహద పడుతుందని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి అన్నారు. గురువారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు దంత వైద్యురాలు శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నోటి ఆరోగ్యం బాగులేక పోతే గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. రోజుకు రెండు సార్లు బ్రష్ చేయాలని, 6 నెలలకొకసారి దంత వైద్యులను సంప్రదిం చాలని సూచించారు. దంత వైద్యులు సౌజన్య, దినేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారా తయారు చేయొద్దు

సాలూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయం, రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యక్ర మాలకు పాల్పొడ్డదని ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమి షనర్ బాబ్జీరావు సూచించారు. గురువారం మరిపిల్లి గ్రామంలో సాలూరు ఎక్సైజ్ సీఐ దాసు ఆధ్వర్యంలో నవో దయం 2.0 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆయన మాట్లాడారు. సారా తయారీ, రవాణా, విక్రయం చేసి కేసుల్లో ఇరుక్కోవద్దన్నా రు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, టీడీపీ నాయకుడు కసినబోయిన వెంకటరమణ తదిత రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాలకొండ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్‌పై నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందిరానగర్‌కాలనీ, వడమ కొత్తకాలనీ, వడమ, మున్సిపల్ కార్యాలయం ప్రాంతం, గారమ్మ కాలనీ, రాజాంరోడ్డు, గజాలఖానా నుంచి తుమరాడ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

ఘనంగా కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

మక్కువ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థాని క జన్నివీధిలో కోటదుర్గమ్మ అమ్మవారి ఆల య ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, టీడీపీ నాయకుడు మావుడి ప్రసాదరావు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులన్నీ శతశాతం పూర్తి కావాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లెపండుగ కింద చేపట్టిన పనులన్నీ రానున్న ఐదు రోజుల్లోగా శతశాతం పూర్తి కావాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, ఐటీడీఏ, పీఐయూ ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ముఖ్యంగా ఫారం పాండ్స్ ప్రహరీలు, మినీ గోకులాలు, రహదారు లపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈనెల 25వ తేదీ నాటికి ఎన్ని పనులు జరిగితే అన్ని పనులు పూర్తి చేయా లని ఆయన ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేం దుకు ఇంకా పది రోజులు గడువు ఉన్నప్పటికీ బిల్లులు సమర్పించేందుకు ఐదు రోజులు మాత్రమే గడువు ఉందని, ఈ లోగా పనులన్నీ పూర్తి కావాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, సీతంపేట గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎంసీఎస్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎంసీఎస్ రాజేశ్వరి

పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా ఐ.రాజేశ్వరి నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆమె గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఇప్పటివరకు జిల్లా మేనేజర్‌గా కొనసాగిన పి.శ్రీనివాసరావు స్థానంలో ఆమె పదోన్నతిపై వచ్చారు.

గడ్డిమందు తాగి మహిళ మృతి

పార్వతీపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డోకిశిల గ్రామానికి చెందిన లీల సత్యశ్రీ (35) అనే మహిళ గడ్డి మందు తాగి గురువారం మృతి చెందింది. ఈ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి భర్త సందీప్ ఉన్నారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వ్యక్తి..

పార్వతీపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సిపురం పంచాయతీ పరిధిలో ఉన్న విజయ బ్యాంకు వద్ద ఉన్న బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పార్వతీపురం పట్టణానికి చెందిన మజ్జి సత్య నారాయణ (54) ఆసుపత్రికి అని వెళ్లి రెండు రోజులుగా కనిపించడం లేదు. నేలబావిలో పడి మృతి చెందిన వ్యక్తి సత్యనారాయణగా గుర్తించారు. దీంతో అతని భార్య పార్వతి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

గరుగుబిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామానికి చెందిన పి.శివసాయి ఆచూకీ లభ్యమైంది. రావివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శివసాయి.. గత నెల 17న పాఠశాల విడిచిపెట్టిన తర్వాత ఇంటికి చేరలేదు. దీంతో తండ్రి పోలయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.రమేష్ నాయుడు కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు విశాఖ, విజయ నగరం తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు శివ సాయి ఆచూకీని కనుగొన్నారు. గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు.

డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించండి

పాలకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా సమస్యగా ఉన్న డంపింగ్‌యార్డుకు సంబంధించిన భూ సమస్యకు లీగల్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మున్సిపల్ శాఖా మంత్రికి వినతిపత్రం అందించారు. డంపింగ్‌యార్డును ఏర్పాటు జరిగేలా చూడాలని, తద్వారా ప్రజల సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.

గ్రామకంఠం భూములను పరిరక్షించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట పంచాయతీలో ప్రభుత్వ, గ్రామ కంఠం భూములను పరిరక్షించాలని కోరుతూ పలు వురు గిరిజన సంఘ నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అంద జేశారు. ఎల్విన్‌పేటలో బదలాయింపు చట్టం 1/70 అమలులో ఉన్నా ఆ ప్రాంతంలోని ప్రభుత్వ, గ్రామ కంఠం భూములను కొంతమంది గిరిజనేతరులు ఆక్రమించి, అనుమతులు లేకుండా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. సమగ్ర దర్యాప్తు జరిపించి, అక్రమంగా చేపట్టిన భవనాలను తొలగించాలని కోరారు. తహసీల్దార్ స్పందించి అలాంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఆరిక చంద్రశేఖర్, ఐ.రామకృష్ణ, లోవరాజు, సీతారాం, తిరుపతిరావు పాల్గొన్నారు.

పక్షపాత ధోరణి విడనాడాలి

● ఎన్ఎంయూ నాయకుల ఆందోళన



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

పాలకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఆర్టీసీ డిపో యాజమాన్యం పక్షపాత ధోరణి విడనాడాలని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక డిపో ఎదుట ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఎన్ఎంయూ డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ మాట్లాడారు. స్థానిక మేనేజ్‌మెంట్ పక్షపాతి ధోరణి అవలంబిస్తోందన్నారు. ఆర్టీసీ ఎండీ ఇచ్చిన 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ఒక యూనియన్‌కు సంబంధించి మహిళలకు స్థానిక డిపో మేనేజర్ సత్కరించి.. ఎన్ఎంయూ మహిళలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కేటగిరీలలో ఖాళీలను అనుసరించి ప్రమోషన్స్ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, అధ్యక్షుడు ఎన్టీ రామారావు, చైర్మన్ మద్ది సుబ్బారావు, సీసీఎస్ డెలిగేట్ ఎం.వైకుంఠం, సభ్యులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు 'శక్తి'

సాలూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల రక్షణకు ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశాలతో సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ.. సాలూరు రూరల్, మక్కువ, పాచిపెంట పోలీస్‌స్టేషన్లలో శక్తి టీంలను ఏర్పాటు చేశారు. సాలూరు రూరల్ శక్తి టీం ఇన్‌చార్జిగా ఏఎస్ఐ శ్రీరాములు, సభ్యులుగా హెచ్‌సీలు సీతయ్య, నారాయణరావు, రాజహంస, సరస్వతిలను నియమించారు. ఈ టీం గురువారం కొత్తవలస గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించింది. శక్తి యాప్‌ను డౌన్ చేసుకోవాలని సూ చించారు. శక్తి టీం బాలికలు, మహిళలకు ఏ విధంగా రక్షణ కల్పించేది వివరించారు. ఏమైనా సమస్యలు ఏర్పడితే శక్తి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే తాము వచ్చి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. హెచ్ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

కూరగాయల పెంపకంపై అవగాహన కల్పించాలి



గిరిజన రైతుతో మాట్లాడుతున్న డీహెచ్‌వో శ్యామల

సీతంపేట రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు శాశ్వత కూరగాయల పందిరిపై అవగాహన కల్పిస్తే బావుంటుందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారిణి శ్యామల అన్నారు. గురువారం సీతంపేట ఏజెన్సీలోని కోసంగి గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో జె.మధుసూదనరావు అనే గిరిజన రైతు 50 సెంట్ల విస్తీర్ణంలో పండిస్తున్న శాశ్వత కూరగాయల పందిరిని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా డీహెచ్‌వో మాట్లాడుతూ గిరిజన రైతులకు శాశ్వత కూరగాయల పందిరిపై శిక్షణ నిర్వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో డీహెచ్‌వోతో పాటు పీహెచ్‌వో వెంకట గణేష్, హెచ్‌వో జయశ్రీలు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

రామభద్రపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నందిగాం ఆదియ్య హెచ్చరించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొంతమంది అవినీతికి పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వస్తోందని, వారిపై పూర్తి స్థాయి విచారణ జరుపుతామన్నారు. గ్రామ సంఘం తీర్మానాలకు వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసిందని, ఇందులో భాగంగా రామభద్రపురం, దత్తిరాజేరు మండలాలను పైలెట్ ప్రోగ్రాంగా ఎంపిక చేశామని తెలిపారు. దీనికోసం ఇప్పటికే సీఆర్పీ ద్వారా సర్వే కూడా పూర్తిచేశామన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు అరుణ వివాదంపై కూడా విచారణ జరుపుతామని ఆయన తెలిపారు. మండల సమాఖ్యలో ఉన్న సభ్యులు నిర్ణయంపై ఆమె భవితవ్యం ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం వెలుగు సిబ్బందితో సమాఖ్య సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం కోట్ల అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెసర, మినుము కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొబ్బిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పెసర, మినుము కొనుగోలు కేంద్రాలను జిల్లాలో ఐదు చోట్ల ఏర్పాటుచేశామని మార్క్‌ఫెడ్ మేనేజరు వేంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పీఏసీఎస్‌లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు చోట్ల బొబ్బిలి, గజపతినగరం, సంతకవిటి, గంట్యాడ, జామి మండలం విజినిగిరిలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. క్వింటా పెసర రూ.8,682, మినుము రూ.7,400 చొప్పున కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అయితే రైతులకు తెలియపరచకుండానే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం పట్ల పలువురు ఆక్షేపణ వ్యక్తం చేశారు.

కోటిపల్లిలో చోరీ

బాడంగి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామంలోని కొల్లి సత్యం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చొరబడ్డారు. బీరువా లాకరును విరగగొట్టి మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు, రూ.2లక్షల నగదు అపహరించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ తారకేశ్వరరావు గురువారం కేసు నమోదు చేశారు.

న్యూస్ బాక్స్

23న ద్విగళ అష్టావధానం

పాలకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 23న ద్విగళ అష్టావధానం నిర్వహించనున్నట్టు శ్రీసూర్యచంద్ర కళా ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీవిశ్వావసునామ సంవత్సర ఉగాది సందర్భంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అష్టావధానంలో సాహిత్య రత్న బంకుపల్లె రమేష్‌శర్మ సభా సంచాలకులుగా వ్యవహరిస్తారన్నారు. ఈ అష్టావధానం ఉదయం 8.30 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా

పాచిపెంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి రూ.10వేలు చొప్పున రూ.40వేల జరిమానా విధిస్తూ సాలూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.కనకమహాలక్ష్మి గురువారం తీర్పు ఇచ్చారని స్థానిక ఎస్ఐ కె.వెంకటసురేష్ తెలిపారు. రెండోసారి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే మూడు నెలలు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారన్నారు.

తప్పిన ప్రమాదం

పార్వతీపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబొండపల్లి పంచాయతీకి చెందిన ఏ.గంగునాయుడు, పి.విజయ్‌కుమార్ తోటలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్టు తాగి నిప్పు అంటించారు. దీంతో మంటలు అంటుకుని గడ్డి కుప్పలు దగ్ధమ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకున్నారు. పక్కనే ఉన్న ధాన్యం బస్తాలు వద్దకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్టు అయ్యింది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మక్కువ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలో 8, 9 తరగతులు చదువుతున్న 24 మంది విద్యార్థులకు పేదరిక నిర్మూలన, పబ్లిక్, ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్ అనే అంశంపై గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన యాసి చందన ప్రథమస్థానం, అనసభద్ర ఏకలవ్య పాఠశాలకు చెందిన బి.ఐబామా ద్వితీయస్థానం, కాశీపట్నం కేజీబీవీకి చెందిన ఎం.సుజాత తృతీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు పెంట సత్యనారాయణ, డి.శ్యాంసుందర్, హెచ్ఎం మజ్జి హేమలత పాల్గొన్నారు.



